# అపజయానికి ఆఖరిమెట్టు

**-యస్వీచారి**

''ఛెళ్!''

తన చెంపని తానే చరుచుకున్నాడు కిషోర్.

అరచేతిలో స్వర్గాన్ని చవిచూసిన దోమ కనిపించింది.

''ప్చ్! తెలివితక్కువ దోమ! తన కాటుకూ, చావుకూ ఒకే ముహూర్తాన్ని పెట్టుకుంటుంది...అదృష్టం వుంటే తప్పించుకుంటుంది..లేకపోతే చావునె దుర్కొంటుంది..నిజంగా దోమలు ప్రాణాలకి తెగిస్తాయి...''

అలా అనుకుంటూనే ఉలిక్కిపడ్డాడు కిషోర్.

బల్లపైనున్న గ్లాసులోని విస్కీ ఎర్రగా కనిపించింది.

ఆ ద్రవం అతనికి రక్తంలా తోచింది.

ఆకలితో ప్రాణాలకి తెగించి తన చేతిలో బలయిపోయిందా దోమ!

కాని దురలవాటుతో బరితెగించిన తను ఈ విస్కీకి బలి కాబోతున్నాడు.

త్రాగుడు తనను కూడా చావుకు చేరువ చేస్తుందేమోనన్న భయంతో కిషోర్ ఓ క్షణం వొణికిపోయాడు.

త్రాగుడుకు బానిసలయి చనిపోయిన ఫాక్టరీలోని తన సహోద్యుగులెందరో అతనికి గుర్తుకురాసాగారు.

చనిపోయిన తన మిత్రుల శవాలపై పడిపోయి భోరుమంటూ ఏడ్చినవారి భార్యలు కూడా అతని కళ్ళల్లో కదిలారు.

ఆ విషయాన్ని మననం చేసుకుంటుండగానే తన భార్య రేవతి జ్ఞాపకం వచ్చిందతనికి.

తను యిక్కడ విస్కీ సేవిస్తూ ఆనందంలో మునిగి తేలుతున్నాడు. అక్కడ యింట్లో ఆ అమాయకురాలు అన్నం కూడా తినకుండా వొంటరిగా కూచుని తనకోసం ఎదురు చూస్తూవుంటుంది.

భార్య రూపం కళ్ళలో కనిపించగానే కిషోర్‌కి ఆమెపై ఎంతో జాలి ముంచుకొచ్చింది.

ఉద్యోగ ప్రయత్నం ఫలించగా కోస్తానుంచి హైదరాబాదు చేరిన కిషోర్ వెంట కొత్తగా కాపరానికి వచ్చింది రేవతి.

వచ్చిన వారంలోగానే కిషోర్ దురలవాటు కాస్తా ఆమెకు తెలిసిపోయింది.

ఆ విషయం తెలిసి కూడా తనని ఏమీ అనకుండా మూగగా బాధపడుతూన్న భార్యపై మొదటినుంచే కిషోర్‌లో సానుభూతి ఏర్పడింది.

అప్పటినుంచే ఈ దురలవాటును ఎలాగయినా మానుకోవాలనే ఆలోచనలో వున్నాడతను.

కాని మార్గం కనిపించటం లేదు.

దానికి తోడు అప్పలయ్య విస్కీని అరువు యిస్తూనే వున్నాడు.

తను మాత్రం చుక్క కూడా నోట్లో వేసుకోని అప్పలయ్య మాత్రం 'సారారం'లో ఓ గదిని అద్దెకు తీసుకుని మందు బాబులయిన తన సహచర్లకు విస్కీని అరువియ్యడం ఓ అదనపు వ్యాపకంగా పెట్టుకున్నాడు. ఇతరుల కాపరాలెలా వున్నా పట్టించుకోని అప్పలయ్య మాత్రం సాయంత్రం ఆరు నుంచి ఏడు వరకు కేవలం ఒకే ఒక గంట సేపు విస్కీని పంచుతాడు. ఆ తర్వాత అతను ఠంచనుగా భార్య ఎదురుగా నుంచోకపోతే ఆమె అతన్ని చంపేస్తుంది.

కేవలం ఆ ఒకే ఒక గంట వ్యాపారంతో అతను ఎంతో ఎదిగిపోతూ వుంటే..మందుబాబులయిన అతని మిత్రులు మాత్రం అధోగతిలోకి జారిపోతున్నారన్నది యదార్ధం!

కానీ ఈ రోజు ఓ దోమ చావు కాస్తా కిషోర్‌కు అతని రాబోయే మరణాన్ని గుర్తు చేసింది.

ఆ కారణంగా అతనిలో ఒక్కసారిగా ఆత్మశోధన కలిగినట్లయింది.

- ★ మనిషి స్థితప్రజ్ఞుడే కానక్ఖర్లేదు.
- ★ కాని స్థిరమైన మనస్తత్వాన్ని కలిగినవాడై వుండాలి.
- ★ ఏ సంకోచాలు లేకుండా నిర్ణయాలు తీసుకునే ఆత్మబలాన్ని ఆపాదించుకోవాలి.
- ★ అలాంటి నిర్ణయాలు ఏ స్థితిలో తీసుకున్నా కూడా పరాజయం అతన్ని ఆవహించదు.
- ★ అనుక్షణం అతని నిర్ణయబలం అతన్ని ప్రోత్సహిస్తూనే వుంటుంది.
- ★ కర్తవ్యం వెన్ను తడుతూనే వుంటుంది.

''రేపట్నుంచి తను ఎలాగయినా విస్కీని మానేయాలి! రేవతిని తప్పకుండా బాగా చూసుకోవాలి!''

కాని ఎదురుగా గ్లాసులో యింకా కొద్దిగా విస్కీ మిలిగిపోవటంతో సందిగ్ధావస్థలో పడిపోయాడు.

చివరికి పరాజయానికే విజయం లభించింది!

''యిక యిదే ఆఖరి గుటక!'' అనుకుంటూ నిజాయితీగానే లేచి నుంచున్నాడు కిషోర్.

కాని ఎదురుగా తను అప్పలయ్య కొట్టు నుంచి తెచ్చుకున్న మసాలాకోడి ముక్కలు కనిపించాయి.

దాంతో మళ్ళీ అతని జిహ్వాజివ్వుమంది. యింకేం? పరాజయానికి పరాకాష్ఠ లభించింది.

''ఇదే ఆఖరి గుటకకు బదులుగా ఇదే ఆఖరి రోజు!'' అనుకుంటూ సరిపెట్టుకున్నాడు.

మందును బాగా సేవించి ఇంట్లోకి అడుగు వేసిన భర్త వంక నిర్లిప్తంగా చూసింది రేవతి.

కాని కొన్ని సమయాల్లో భోజనం సహితం మానుకుని పడుకుని పోయే అతగాడా రోజు రాత్రంతా కూడా నిద్ర లేకుండా కూచుని పోవటం ఏమిటో ఆమెకు బోధపడ లేదు.

మనిషి నిజాయితీగా ఏదో క్షణంలో తీసుకున్న బలమైన నిర్ణయ ప్రభావం అతన్ని వెన్నాడుతూనే వుంటుంది. అది నిద్ర తర్వాత కానీ..త్రాగుడు తర్వాత కానీ..యితరుల ప్రమేయం వల్ల కానీ తన బలాన్ని కోలుపోదు..కాబట్టి నిష్కల్మషంగా ఓ నిర్ణయాన్ని తీసుకోవాలి!..

యిపుడు కిషోర్ విషయంలో అదే జరిగింది.

ఓ దోమ చావుతో మొదలయిన ఆలోచనలు తన చావుకే మార్గాన్ని సూచించినట్లు కావటంతో నిజంగానే 'త్రాగొద్దనే' బలమైన నిర్ణయం అతని రక్తంలో జీర్ణమయి పోయింది.

అందుకే ఆ రక్తంలోని విస్కీ కూడా ఆ నిర్ణయాన్ని జయించలేకపోయింది.

ఆ కారణంగానే ఆ రాత్రంతా మనోబలాన్ని కూడగట్టుకునే ప్రయత్నం చేశాడు కిషోర్.

మర్నాడు ఫాక్టరీ నుంచి రాగానే సాయంకాలం ఐదు దాకా ''నథింగ్ డూయింగ్...నో విస్కీ ఫ్రం టుడే!'' అనుకుంటూనే స్థిరంగా కూర్చున్నాడు.

ఆరు కావస్తున్నా బయటికి వెళ్ళకుండా ఏదో పుస్తకాన్ని తిరుగవేస్తూన్న భర్తవంక వింతగా చూసింది రేవతి.

ఆరున్నర దాకా తన మనోధైర్యాన్ని కాపాడుకున్నాడు కిషోర్.

చివరికి ఆరూ యాభయిదాకా కూడా పోరాడాడు. కానీ ఓడిపోయాడు.

ఆ తర్వాత ఓ సాకును ఆధారంగా ఎన్నుకున్నాడతను.

ఇపుడు తను మోపెడ్‌పై వెడితే పది నిమిషాల్లో అప్పలయ్య కొట్టుకు చేరుతాడు.

ఒక వేళ ఏడులోగా అక్కడికి చేరుకోకపోతే అప్పలయ్య అక్కడ వుండడు..విస్కీ వుండదు.

అలా జరగాలని మనసులో కోరుకుంటూనే వీధిలోకి వెళ్ళాడు కిషోర్.

కానీ ఆ బండి ఓ రెండు నిమిషాలు ముందుగానే అప్పలయ్య కొట్టుని చేరుకోవటంతో ఆ రోజతని వ్రత

భంగం కాస్తా యధాతథంగా జరిగిపోయింది.

ఆ మర్నాడు కూడా సాయంత్రం నుంచే ఖచ్చితంగా బయటికి కదలకుండా కూర్చున్నాడు కిషోర్.

పైగా భార్యతో కబుర్లు చెప్పుకుంటూ అదో యిదో ఏదో పనులు చేస్తూ వుండిపోయాడు.

భర్తలో కొద్దిగా మార్పు కనిపిస్తూ వుండటంతో రేవతి కూడా ఎంతో సంతోషించసాగింది.

కానీ ఆరూయాభై దాకా కొనసాగించిన కిషోర్ ప్రయత్నం కాస్తామళ్ళీ విఫలమయిపోయింది.

అతనిలోని బలహీనత తిరిగి బలాన్ని పుంజుకుంది. కానీ మనస్సులోని నిర్ణయబలం మాత్రం మరో అడ్డంకిని సూచించింది.

అయితే- ఎప్పుడూ రోడ్డుపైన కావాల్సినపుడల్లా కనిపించని 'సారారం' బస్సు కాస్తా కిషోర్ కాలనీలో నుంచి బయటకురాగానే కనిపించింది. పైగా అతని ముందే సైకిల్ వాడెవడో రావటంతో దాదాపు ఓ క్షణం ఆగిపోయింది.

ఇంకేం? ఆ కాస్త సమయం చాలు!

బస్సు ఫుట్‌బోర్డ్‌మీద వేళ్ళాడుతూన్న జనం కిషోర్‌ని లోనికి లాగేసుకున్నారు..

ఆ మరుక్షణమే విస్కీ అతన్ని లాగేసుకుంది.

రెండు రోజులలా ఓడిపోయినా విక్రమార్కుడి పట్టుదలలా తన నిర్ణయాన్ని మాత్రం మానుకోలేదు కిషోర్.

మూడో రోజు కూడా బస్సు ప్రయాణాన్నే ఎన్నుకున్నాడతను. రోడ్డు పై నుంచుని వుండగా బస్సు దొరకలేదు. కాని ఓ మిత్రుడి లిఫ్ట్ మాత్రం లభించింది.

కానీ ఆ మిత్రుడి వాహనం అప్పలయ్య కొట్టు ముందు ఆగగానే మూసి వున్న కొట్టు తలుపులు కిషోర్‌ను చూసి నవ్వాయి.

అది చూసి విచారించటానికి బదులుగా చాలా సంతోషిస్తూ యింటికి తిరుగుమొహం పట్టాడతను.

మొట్టమొదటిసారిగా మందు తీసుకోకుండా ఇంట్లోకి అడుగువేసిన భర్తని చూసి రేవతి సంతోషంతో పొంగిపోయింది.

నాలుగోరోజూ..ఐదోరోజూ కూడా అప్పలయ్య కొట్టు మూత పడ్డాకే బస్సు సారారం చేరటం వల్ల వరుసగా మూడు రోజులూ మందు రుచి చూడలేదు కిషోర్.

అది అతన్ని బాధించలేదు కాని, ఆ బస్సు ప్రయాణం మాత్రం అతన్ని నానాయిబ్బంది పెట్టింది.


ఆ కారణంగా ఆరవరోజు బస్సులో వెళ్ళే ప్రయత్నానికి స్వస్తి చెప్పాడతను.

కాని మందు మానాలన్న తన ఆలోచననింకా కొనసాగిస్తూనే వున్నాడు కిషోర్.

అందుకే ఆ రోజు కూడా ఆరూయాభై దాకా అతని మనోనిబ్బరం కొనసాగుతూనే వుంది.

ఆ అంతర్మథనాన్ని భరిస్తూనే వున్నాడతను.

అయితే యధాప్రకారంగా ఆ చివరి పది నిమిషాల సమయం అతన్ని తిరిగి నిర్వీర్యుణ్ణి చేసేసింది.



సరిగ్గా ఆరూ యాభైకి మోపెడ్‌ని వీధిలోకి తీసుకువెడుతూన్న భర్త వంక విచారంగా చూస్తుండిపోయింది రేవతి.

వీధిలోకి వెళ్ళిన కిషోర్ బండిని ముందుకు పోనీయకుండా ఆగిపోయి వెనుక చక్రంలోని గాలి క్రమంగా తగ్గేలా వాల్వ్‌ని వదులు చేశాడు.

గాలి ఎక్కడ పూర్తిగా తగ్గిపోతే అక్కడ ఆగిపోవాలనే ఆలోచన అతనిది.

కాని అతని మోపెడ్ దాదాపుగా అప్పలయ్య కొట్టుకు చేరువలోనే ఆగింది.

ఎదురుగా తెరిచివున్న ఆ కొట్టు ద్వారాలు కిషోర్ మానసిక స్థితిగతులను సవాలు చేస్తున్నాయి.

మూడు రోజులుగా మందు జోలికిపోలేని అతనిలోని ఆత్మవిశ్వాసపు విలువల అంచులు ఎదిగిపోయాయి.

ఆ కారణంగా అప్పలయ్య కొట్టుమూసే దాకా స్థిరంగా శిలావిగ్రహంలా అలా దూరంగానే నుంచునిపోయి ఆ తర్వాత బండిలో గాలిని నింపుకుని యింటికి వెనుదిరిగి వెళ్ళాడు కిషోర్.

ఆరోజు కూడా మందు తీసుకోకుండా వెనుదిరిగి వచ్చిన భర్తని ఆప్యాయంగా ఆనందంగా దగ్గరికి తీసుకుంది రేవతి.

మొట్టమొదటి సారిగా భార్య ముందు సిగ్గుపడిపోతూ రేవతి గుండెల్లో తల దాచుకున్నాడు కిషోర్.

ఆ మర్నాడు అనగా ఏడోరోజు అటు బస్సూ, యిటు మోపెడ్ కాకుండా నడిచి వెళ్ళాలనే నిర్ణయానికి వచ్చాడు కిషోర్.

నాలుగు రోజులు వరుసగా మందు లేకుండా వుండగలిగిన అతనిలో నమ్మకం మరింతగా పెరిగిపోయింది.

అపజయానికి ఆఖరి మెట్టుని దిగిపోయి విజయానికి తొలిమెట్టుని ఎక్కబోతున్నాననే భావన అతన్ని నిలువెత్తునా పులకరింపజేసింది.

అంతే... అప్పలయ్య కొట్టు మూసివున్న తలుపులకు శాశ్వతంగా వీడ్కోలు పలికి వెనుదిరిగాడతను.

ఆరోజు ఆ కొట్టు వైపునకు కిషోర్ వేసిన ప్రతి అడుగూ కూడా అతన్ని త్రాగుడు దురలవాటు నుంచి వెనుకడుగు వేసేలా చేసింది.

గత నాలుగయిదు రోజులుగా మందుకు దూరం కావటం కోసం భర్త పడుతూన్న అవస్థని గమనిస్తోన్న రేవతి ఆరోజు కూడా కిషోర్ విజయవంతంగా తిరిగి రావటాన్ని దేవుడిచ్చిన వరంగా భావించి గుడికెళ్ళాలని నిర్ణయించుకుంది.

ఆ తర్వాత ఆ జంట కలిసి మొదటిసారిగా హారతి పళ్ళెంతో కాలనీ వీధిలో నడిచి వెడుతుండగా ఎరిగిన జనం అంతా ఆశ్చర్యంతో నుంచుని పోయారు.

కేవలం ముక్కున వేలేసుకోవటమే వారి వంతయి కూచుంది. ★